

# చెవికమ్మలు

## కె.వి.ఎస్. యోగానంద్

ఓ ఆదివారం మధ్యాహ్నం సుష్టుగా భోజనంచేసి , నిద్రకి ఉపక్రమిస్తుండగా, మా అమ్మాయి సమీర వచ్చి, "నాన్నగారూ! ఈసారి నా పుట్టినరోజుకు చెవి కమ్మలు చేయించి పెడతారా?" అంది.

"కమ్మలెందుకమ్మా? అవి ఫ్యాషన్ కాదు గదా! ఇప్పుడు బోలెడు మోడల్సు ఉంటాయి. అవి చేయించుకో" అన్నాను.

"కాదు డాడీ! మీరు క్లినిక్‌లో మీ టేబుల్ మీద ఓ జత చెవికమ్మలు ఓ చిన్న ఫ్రేములో పెట్టి ఉంచారు. అవి పాత మోడల్‌వి అయినా చూడటానికి చాలా అందంగా ఉంటాయి. నేనొకసారి బయటికి తీయబోతే తిట్టారు,. గుర్తుందా? అప్పటినుండి వాటి మీదే నా దృష్టి. సరేనా?" అంది.

అనాలోచితంగా అలాగే అన్నాను గానీ, నా మనస్సు ఇరవై సంవత్సరాల వెనక్కి వెళ్లిపోయింది.

000

అవి నేను విశాఖపట్నంలో, ఆంధ్రా మెడికల్ కాలేజీలో చదువు పూర్తి చేసి అక్కడే కె.జి.హెచ్.లో హౌస్ సర్జెన్సీ చేస్తున్న రోజులు. షిఫ్టుల్లో డ్యూటీ, సీనియర్ డాక్టర్ల చిటపటలు. జూనియర్ డాక్టర్ల జాలిచూపులతో రోజులు గడిచిపోయేవి. హౌస్ సర్జన్ అంటే చాలామంది నర్సులకీ చులకనే. పిల్ల కాకిగాడు వీడికేం తెలుసు అన్నట్లుండేవారు. అయితే ఇవన్నీ ముందే తెలిసిన విషయాలు కాబట్టి నేను బాగానే అడ్జస్టయిపోయాను. థియరీలో చదివిన విషయాలు ప్రాక్టికల్‌గా నేర్చుకునే సదవకాశమే హౌస్ సర్జన్సీ. కావాలనుకున్న వాళ్లకి బోలెడన్ని అవకాశాలు అప్పైర్సుకి.

ఇన్‌ఫ్లుయన్స్ ఉంటే కష్టపడనవసరం లేని వార్డులు, సుఖమైన షిఫ్టులు దొరుకుతాయి. నేను మటుకు ఏ డ్యూటీ వేస్తే అది చేసేవాడిని. నా మెతకతనం, పనిలో ఇంటరెస్టు చూసి మా క్లాసు మేట్సు కొందరు వాళ్లకి ఇష్టంలేని డ్యూటీలని నా కప్పగించేవారు.

రెండు నెలలు క్యాన్సరు వార్డులో డ్యూటీ పడింది. వాళ్లని చూస్తే చాలా జాలి కలిగేది.చాలా మందివి టెర్మినల్ కేసులు. వాళ్ళ అనారోగ్యానికి తోడు వార్డుబోయ్స్, నర్సులు మరీ అలుసుగా చూసేవారు. ఒకరోజు సింహాచలం అనే పేషెంటు చేరింది. ఆమెకి ఒక చెయ్యి అవిటి. ముఖంలో సగం కాలిపోయి ఉంది. శరీరంలో నీరు పడుతోంది. రెండు నెలల కంటే బతకడం కష్టం. అటువంటి కేసు.

ఎందుకో తెలియదుగానీ, నేనామెపై ప్రత్యేకశ్రద్ధ చూపేవాడిని. లోపల ఎంత బాధ ఉన్నా, ముఖంపై ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేది. ఆమె చెవులకి చక్కని బంగారు కమ్మలు మెరుస్తూ ఉండేవి. నేను ఆమెతో మాట్లాడినప్పుడల్లా ఆమె ముఖంలో చిన్నవెలుగు కనిపించేది. నా అన్నవారు ఎవరూ లేని ఆమె స్థితిని చూసి నాకు జాలి కలిగేది. ముఖం ఎప్పుడో ఏక్సిడెంటులో కాలిపోయి ఉంటుంది. లేకపోతే కళయిన ముఖమే. తీరిక సమయాల్లో, క్యాబిన్‌లో కూర్చోకుండా ఆమె దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేవాడిని. సింహాచలాన్ని సరదాగా ఏడిపిస్తూ ఉండేవాడిని. "నీకేమిటమ్మా! గుడి దగ్గర కూర్చుని అడుక్కుని బాగా సంపాదించి ఉంటావు. నెలనెలా నీ సంపాదన మా స్టైపండు కంటే ఎక్కువే ఉంటుంది. ఈ ఆస్తంతా ఎవరికిస్తావు? నీకెవరూ లేరన్నావు గదా! నన్ను దత్తత తీసుకుని నీ ఆస్తి నాకు రానిచ్చేయి" అని అంటూ.

"డాట్టరు బాబు పరాసికాలాడుతున్నారు. ఏ రోజు తిండి ఉంటదో, ఏ రోజు ఉండదో తెలియని బతుకులు మాయి. గుడిసెకి నెలద్దె కట్టడానికీ, తినడానికీ సరిపోయేది నా సంపాదన. అంతే కాని, మాకు ఆత్తిపాత్తులెక్కడుంటాయి బాబయ్యా?"అంది.

"అబద్ధాలు ఆడుతున్నావు సింహాచలం. చెవులకి బంగారు కమ్మలు కూడా ఉన్నాయి నీకు. గూడెంలో ఎంతమందికి ఉంటాయి చెప్పు. అంటే నువ్వు కూడా ఎంతో కొంత గొప్పదానివే" అన్నాను నవ్వుతూ.

అంతవరకూ నవ్వుతూ ఉన్న ఆమె ముఖం ఒక్కసారిగా వివర్ణమైపోయింది. నేను కంగారు పడ్డాను తప్పుగా మాట్లాడానేమోనని. "ఏమైంది, సింహాచలం?" అని అడుగుతుండగా, నర్సు వచ్చి ఎమర్జన్సీ అవడంతో అక్కడి నుండి వెళ్లిపోయాను.

మర్నాడు ఖాళీ సమయంలో ఆమె దగ్గరకు వెళ్లాను. సింహాచలం మామూలుగానే నవ్వుతూ పలకరించింది. నేనే ముందటి రోజు సంఘటనకి విచారం వెలిబుచ్చాను.

"బాబుగోరూ! మీరేమీ తప్పుగా మాట్లాడలేదు. మీరు నా సెవికమ్మల గురించి అడిగేసరికి, దాని యెనక నున్న నా బాదలన్నీ వక్కపాలి గుర్తు వచ్చి నే నలా అయిపోయానంతే. మీ తప్పేమీ లేదు. ఆ కమ్మల యెనక పెద్ద కత ఉంది. యీలయితే యినండి" అంది.

ఎలాగూ చేసే అర్జెంటు పని ఏదీ లేదు గదాని, ఆమె దగ్గరగా స్టూలు లాక్కుని కూర్చున్నాను.

"డాట్టరు బాబూ! చిన్నప్పుడు మా పక్క గుడిసెలో లచ్చమ్మని నాయుడు పిల్లే ఉండేది. వాళ్ళయ్య మిల్లులో పని చేసేవోడు. వోసారి బోనస్సొచ్చిందని వాళ్ళయ్య లచ్చమ్మకి బంగారంతో సెవికమ్మలు సేయించాడు. అయి నాకు ఎంత నచ్చాయంటే వాటిని సూడ్డానికని పొద్దత్తమానూ నేను లచ్చమ్మ చుట్టూ తిరుగుతుండేదాన్ని.

"వొ రోజు నేను దాన్ని బాగా బామాలితే, అయి తీసి నా సెవలకి యెట్టింది. అద్దంలో నన్ను చూసుకును మురిసేలోగా దాని అయ్య వచ్చేశాడు. కమ్మలు నా సెవలకి చూసి లచ్చమ్మని బాదేసాడు. నాకు బాధనిపించి, కమ్మలు లచ్చమ్మకిచ్చేసి మా గుడిసెకెల్లిపోయాను. మల్లీ యెప్పుడూ లచ్చమ్మ దగ్గర కెల్లలేదు. అయితే, నాకు ఆ కమ్మల మీద కోరిక తగ్గలేదు.

"మా అమ్మని అడుగుతూ ఉండేదాన్ని. అలాంటి కమ్మలు సేయించిపెట్టమని. మొదట్లో, అట్టాగే సుద్దాం అనేది. నాల్గయిదు సార్లడిగాకా, తిట్టిపోసింది. వయసొచ్చిందని పెల్లి సేసారు మా వోళ్ళు. మా ఆయన రిచ్చాలాగేవోడు. డబ్బులు బానే వొచ్చేయి. మొదటిరాత్రి కమ్మల గురించి నా కోరిక ఆడితో సెప్పాను. కొత్త పెల్లాం మోజులో వట్టేసి సెప్పాడు, మూడు నెలలలోపే సేయిస్తానని.

"పెతిరాత్రీ గుర్తు సేసేదాన్ని. అలాగేనని, వాడవసరం తీరిపోయాక సూద్దాంలే అనేవోడు. నెలరోజులయేసరికి యిసయాలు తెలియడం మొదలయ్యాయి. సంపాదించిన దాన్లో సగం పైగా ఆడు తాగడానికే కర్సు సేత్తాడని. పోనీలే. రోజంత రిచ్చా లాగి కట్టబడతాడు. సెమ మర్సిపోడానికి లేనని సర్దుకు పోయాను. యీలయినప్పుడల్లా కమ్మలు గురించి గుర్తు సేసేదాన్ని. ఒకటి రెండు సార్లయాక చితక బాదేసాడు. బండ బూతులు తిడుతూ... మీలాటి వోల్లు యినలేనియి.

"మా వోడి తాగుడెక్కువైపోయింది. సంపాదన తగ్గిపోయింది. ఇది సాలనట్టు యేరేదానితో సంబంధం యెట్టుకున్నాడు. పొట్టకోసమని నాల్గిల్లల్లో పని సేయడం మొదలు పెట్టాను. ఆల్లిచ్చే మిగిలిన అన్నాలు, కూరలతోనూ, నెలజీతంతోనూ రోజులు గడిసేయి. నా దగ్గర డబ్బులు కన్పించినప్పుడల్లా తన్ని లాక్కునేవోడు మా ఆయన. అయితే ఆ చెవికమ్మల మీదమోజు అలాగే వుండిపోయింది నాకు.

"నేను పనిచేసే యిల్లల్లో, లలితమ్మగోరని వో దొడ్డయిల్లాలు నన్ను పేమగా, అబిమానంగా సూసేది. నేను నెలనెలా వచ్చే జీతంలోంచి కొంత ఆవిడ దగ్గర దాయడం మొదలుపెట్టాను. ఎప్పటికైనా చెవికమ్మలు సేయించుకోవాలని. ఇంట్లో మా వోడు యెట్టే బాదలు పెరిగాయి. నేనాడి తాగుడికి డబ్బులివ్వటం లేదని. మౌనంగా దెబ్బలు బరించేదాన్నే గానీ, నేను

## బరువుమోత

బెర్నార్డుషాను చూసి యూజినీ శాండో, తనకు శిష్యుడుగా చేరితే కాస్తకండపుష్టి కల్పిస్తానన్నాడు. షా ఇలా జవాబిచ్చాడు.

"నాక్కావలసింది బలం కాదు. నీవు గుండెల మీదేమో రెండు పెద్ద పియానోలూ, రెండు యేనుగులూ నిలబెట్టుకుంటున్నావు. నేనేమో వాటిని నా గుండెలమీది నుంచి దించివేసుకోవాలని చూస్తున్నాను. బరువు ఎత్తుకోవాలనుకునేవాడివి నీవూ, దించుకోవాలనుకునేవాడిని నేనూ."

ఆడికి డబ్బులిచ్చేదాన్ని కాదు.

"రెండేల్లకి, కమ్మలు సేయించడానికి సరి పోయేంత డబ్బులు కూడబెట్టాను. లలితమ్మ గోరితో సెప్పి వాల్ల కంసాలి దగ్గరే కమ్మలు సేయించాను. శానా సక్కగా వొచ్చాయి, నా కిట్ట మయినట్టు. తొరలో, వరలచ్చిమ్మ వ్రొతం వత్తోం దని ఆ రోజు యెట్టుకోమని లలితమ్మగోరు సెప్పారు. కమ్మలు ఆవిడ దగ్గరే వుంచాను. మర్నాడు వ్రొతం అనగా ఆ సాయంత్రం వారింటి నుండి తెచ్చి గుడిసెలో బద్రం సేసాను.

"ఆ రాత్రి మా వోడు పూటుగా తాగొచ్చాడు. డబ్బులడిగితే లేవన్నాను. గుడిసెంతా యెతికితే నా కమ్మలు వాడి సేతబడ్డాయి. నా పానం పోయి నట్టయింది. ఆడిని యెదిరింది ఆడి సేతిలోంచి కమ్మలు లాక్కోబోయాను. పక్కనే ఉన్న వో కర్ర పేడుతో నెత్తిమీద గట్టిగా కొట్టి, వో తోపు తోసాడు. ఆ పద్దం మండుతున్న పొయ్యి మీద పడ్డాను. వుడుకుతున్న యెసరు ముఖం మీద పడింది. నన్ను ఆపుకోడంలో సెయ్యి యిరిగింది. ఆడు బయపడి పారిపోయాడు, కమ్మలతో సహా. నా అరుపులకి పక్కింటివోల్లు వచ్చి పెద్దాసువత్రిలో సేర్పించారు. నెలరోజుల తర్వాత అవిటి సేత్తోనూ, కాలిన ముకంతోనూ ఆస్పత్రి నుండి బయటపడ్డాను.

"నా మొగుడు నన్నొదిలేసాడు. యికారమైన ముకం, పని సేసి సంపాదించలేని అవిటిదాన్నని. మునుపు పని సేసే యిల్లకి వెల్లాను, పని యిత్తా రేమోని. నా మొండి సెయ్యి సూసి, మొండి సెయ్యి సూపించారు. అయినా ఆల్ల తప్పు లేదులే బాబయ్యా, నాకు ఆ సెవికమ్మల మీదకోరిక సావ లేదు.

"కేంపు పెడితే, డబ్బు కోసమని ఆపరేసను సేయించుకున్నాను. కొంత కొంత డబ్బు యెన కేత్తూ వచ్చాను. అప్పుడప్పుడు అర్ధాకలితో వత్తు లుండేదాన్ని. ఈలోగా యి మాయదారిరోగం వచ్చింది. నా కోరిక తీరకుండానే, సచ్చిపోతాననే బెంగట్టుకుంది. ఇంకో రెండొందలుంటే మల్లీ కమ్మలు సేయించుకోవచ్చు.

"నేనడుక్కునే గుడిదగ్గరే, వో కుట్టోడు కూడా అడుక్కునేవోడు. ఆడికి రోజూ డబ్బులు బాగా దొరికేయి. ఆడు రోజూ నా వంక ఆకలిగా సూత్తూ ఉండేవోడు. రెండొందలు సద్దమని అడి గితే ఆడి కోరిక బయట పెట్టాడు. సివరికి వో రాత్రి ఆడితో గడిపాను. ఇందాక సెప్పాను గదా! నాకు జీయితం మీద పూర్తిగా యిరత్తి పుట్టిందని. మొత్తానికి కమ్మలు సేయించాను. అయ్యే, యియి. పెట్టుకున్న వారం రోజులకే రోగం ముది రిందని నన్నిక్కడ సేర్పించారు.

"నిన్న మీరు నా కమ్మల గురించి అన గానే, వో చనం నా కట్టాలన్నీ గుర్తొచ్చి అలా అయ్యానంతే. మీ తప్పేం లేదు. మీ అంత మంచి డాట్టరు బాబుని యింతవరకూ సూడలేదు. ఎవరూ మీ అంత పేమగా దయగా సూడరు" అంది.

చివర్లో ఆమె కంఠం పూడుకుపోయింది. నా కళ్లలోంచి పెల్లుబికి రాబోతున్నాయి కన్నీళ్లు. ఆమె చూడకుండా తలపక్కకి తిప్పేశాను. గొంతు భారమైపోయింది. లేని అర్జెంటు పని కల్పించుకుని,అక్కడ నుండి తప్పుకున్నాను. ఆ రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదు.

మర్నాటి నుండి నాకు నైటు షిఫ్టులు. తీరిక సమయంలో ఆమె దగ్గర యెక్కువగా గడిపేవా డిని. రెండ్రోజుల తర్వాత ఆమె ఆరోగ్యం మరింత క్షీణించసాగింది. ఒళ్లంతా నీరు పట్టే సింది. నాల్గో రోజనుకుంటాను. రాత్రి ఒక ఎమ ర్జెన్సీ కేసు చూసి, టీ తాగుదామని బయటికి వెడుతుంటే డ్యూటీ నర్సు పరిగెత్తుకుని వచ్చి చెప్పింది, సింహాచలానికి చాలా సీరియస్సుగా ఉందని,. గబగబా ఆమె దగ్గరికి పరిగెత్తాను.

## షా ఏమి చెప్పినట్టు?

*బెర్నార్డ్ షా చిన్నతనంలో డబ్లిన్ మౌంట్ జాయ్ జైలుకు వెళ్లి చూశాడు. యాభైఏళ్ల తర్వాత ఆ సంగతిని జ్ఞాపకం చేసుకొని కింది విధంగా వ్రాశాడు:*

*"వీరిని సంస్కరించడం అసాధ్యం: వీరిని హింసించడం నిష్ప్రయోజనం: వీరిని వదలడం ప్రమాదకరం."*

అప్పటికే ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. ఎమర్జెన్సీలో వాడాల్సిన ఇంజక్షన్లు ఇచ్చాను. ఎన్ని ప్రయత్నాలు చేసినా, లాభం లేకపోయింది. రాత్రి ఒంటి గంట ప్రాంతాల్లో ఆమె నా చేతుల్లోనే పోయింది. సాయంత్రం వరకూ అందరితోనూ నవ్వుతూ మాట్లాడిన సింహాచలం ఇక లేదు అన్న భావన నా మనస్సుని వికలం చేసింది. తేరుకోవ డానికి పది నిముషాలు పట్టింది.

రిపోర్టు తయారుచేసి మార్చురీకి ఫోను చేసాను, వచ్చి శవాన్ని తీసికెళ్లమని. వాళ్లు వచ్చి, ఆమెని స్ట్రెచరు మీద పెట్టి ఎత్తబోతూ ఆగిపో యారు. "ఎందుకని?" అడిగాను. శవం చెవులకి కమ్మలు ఉన్నాయి. అవి ఆర్.ఎమ్.వో. వచ్చి తీసి సీల్ చేస్తే గానీ శవానని తీసికెళ్లమన్నారు.

వాళ్లన్నదీ రైటే. రూల్ ప్రకారం ఏదైనా శవాన్ని, బంధువులు లేకపోతే మార్చురీకి తీసి కెళ్లాలంటే, ఆ శవం మీద నున్న విలువైన వస్తు వులన్నీ ఆర్.ఎమ్.వో. పోలీసుల సమక్షంలో సీల్ చేసి రిపోర్టులు రాస్తాడు. అప్పుడే ఆ శవాన్ని మార్చురీకి తరలిస్తారు. రూల్సు తెలిసిన నేను, వాళ్లని గట్టిగా యేమీ అనలేను. ఆర్.ఎ.మ్.వో. ఉదయం తొమ్మిదికి వస్తాడు. అంత వరకూ యెలా? మార్చురీ వాళ్లని బ్రతిమిలాడాను. ఫలితం లేకపోయింది. వాళ్లు సింహాచలం శవాన్ని స్ట్రెచ్చరు మీద నుండి తిరిగి మంచం మీదపడేసి వెళ్లిపోయారు.

ఈ లోగా మిగతా పేషెంట్ల గొడవ మొదల యింది, శవాన్ని అక్కడ నుండి తీసివేయాలని. పైగా తిట్లు. "దొంగ ముండ. ఆ చెవికమ్మలెం దుకో దాని ముఖానికి? దాని అందానికి అవి ఒక్కటే తక్కువ. అవి లేకున్నా బాగుండేది. మనకీ శవజాగారం తప్పేది" అంటూ.

నాకు అనిపించింది వీళ్లసలు మనుషులేనా అని. రాత్రి వరకూ సింహాచలంతో నవ్వుతూ మాట్లాడినవాళ్లు, కొన్ని నిముషాల్లో యెలా మారి పోయారో. విపరీతమైన కోపంతో వాళ్లమీద గట్టిగా అరిచేశాను. ఎప్పుడూ నన్నా స్థితిలో చూడనివాళ్లు, కొద్దిగా తగ్గారు. కాసేపయాక మళ్ళీ అదే రభస. కొంతమందైతే వార్డులోంచి వెళ్లిపోతామన్నారు.

నేవు ఆర్.ఎమ్.వో. ఇంటికి ఫోన్ చేసి బతిమిలాడాను త్వరగా రమ్మని. తిట్టుకుంటూ ఏడింటికి వచ్చాడాయన. అంతవరకూ నేను సింహాచలం దగ్గర కాపలా, ఆమె శవాన్ని మిగతా పేషంట్సు బయటపడేస్తారేమోనన్న భయంతో. కమ్మలు తీసి కవర్‌లో సీలు చేసి, రిపోర్టు రాసాక, మార్చురీ వాళ్లు వచ్చి సింహాచలం శవాన్ని తీసుకెళ్లారు.

నాలో చెప్పలేని బాధ. ఏ చెవికమ్మల కోస మని జీవితకాలమంతా యెదురుచూసిందో, వాటిని దక్కించుకోబోయి అవిటిదైపోయిందో, చివ రికి కుష్టువాడికి ఒళ్లప్పగించిందో , ఇలా ఎన్నో కష్టాలు పడి చేయించుకున్న ఆ చెవికమ్మలు సింహాచలం మరణించినా ఆమె శవాన్ని కూడా బాధపెట్టకుండా వదల్లేదు.

నాల్రోజులు సెలవు పెట్టేశాను. సింహాచలం మరణం, మిగతా పేషంట్సు బాధాకరప్రవర్తన నన్ను బాగా కలవరపెట్టాయి. సెలవు నుండి వచ్చాక రూల్సు కనుక్కుని ట్రెజరీలో డబ్బుకట్టి ఆ చెవికమ్మల్ని నా సొంతం చేసుకున్నాను. ఇవాళ అవే ఫ్రేములో నా క్లినిక్‌లో టేబిల్ మీద ఉన్నాయి. సింహాచలాన్నీ, ఆ కమ్మల వెనుక నున్న కన్నీటి గాథల్నీ గుర్తు చేస్తూ.

■